
## ఈ వారం తెలుగు పుస్తకం

# వెలుగు నీడల నార్ల బాట

——— ఎం.వి.ఆర్. శాస్త్రి




**Author:** Narla Venkateshwara Rao
**Subject:** ESSAYS - ANTHOLOGY
**Year of Publication:** 2004
**Price:** USD $ 4.62

పూర్వ కాలంలో తెలుగు పత్రికలు ఇప్పటిలా నదురుగా నవనాగరికంగా ఉండేవి కావు. నాసిరకం కాగితం... అలుక్కుపోయే అక్షరాలు... కనపడీ కనపడని బొమ్మలు ... చప్పటి హెడ్డింగులు... చప్పిడి వార్తలు...చచ్చు రకం పేజి మేకప్పులు... రంగుల హంగులు మొదలే సున్న! తెల్లారేసరికి పేపరు చేతిలో ఉందంటే అది ఖచ్చితంగా నిన్నటిదే అయి ఉంటుంది! పెద్ద పెద్ద పట్టణాలూ, నగరాలలోనే ఏ రోజు పేపరు ఆ రోజు మధ్యాహ్నానానికి పాఠకుడి కందితే గొప్ప. జిల్లాకో ఎడిషను కలలో మాట. లక్ష సర్క్యులేషన్ అంటే చాలా ఎక్కువ !

పత్రికల అమ్మకాలు తక్కువైనా పత్రికల మీద నమ్మకాలు మన కాలంలోకంటే అప్పుడే జాస్తి. ప్రాచుర్యం పరిమితమైనా ప్రజల ఆలోచనా విధానంపై పత్రికల ప్రభావం అపరిమితంగా ఉండేది. తమ అభిమాన పత్రికలో ఏదైనా వచ్చిందంటే అది అక్షర సత్యమై ఉంటుందన్న విశ్వాసం పాఠకులకుండేది.

ఈ కాలంలో సగటు తెలుగు పత్రిక తన చుట్టూ తాను తిరుగతూ రాజకీయ నాయకుడి చుట్టూ తిరుగుతున్నది. రాజకీయవాది చెప్పినట్టు అతడికి కావలసినట్టు నడుస్తున్నది. అతడు ఆడించినట్టల్లా ఆడుతున్నది. వెనకటికాలంలో -అన్నీ కాకపోతే కొన్ని పత్రికలయినా రాజకీయప్రభావాలకు, ఒత్తిళ్ళకు, రాజకీయరాగద్వేషాలకు అతీతంగా, ఉన్న పరిమితుల్లో శక్తి వంచన లేకుండా ప్రజల పట్ల బాధ్యతను నిర్వర్తించేవి. కొన్ని వేలు మాత్రమే సర్క్యులేషను కలిగిన పత్రికలు కూడా ప్రజా నాయకుల, మేధావుల ఆలోచనా రీతిని, సామాజిక గతిని ప్రభావితం చేయగలిగేవి. ఇప్పటితో పోలిస్తే సప్లిమెంట్ల బరువు తక్కువైనా సమాజంలో పరువు పత్రికలకు అప్పుడే ఎక్కువగా ఉండేది.

అపురూపమైన ఈ పరువును నాటి పత్రికలకు సమకూర్చిపెట్టినవాడు సంపాదకుడు. మొత్తం పత్రికా వ్యాసంగానికి అతడే జీవనాడి. అతడి స్థాయిని బట్టే పత్రిక స్థాయిని ప్రజలు బేరీజు వేసుకునేవారు.కొన్ని దశాబ్దాల కిందటి వరకూ తెలుగు పత్రికా రంగంలో దిగ్గజాల్లాంటి సంపాదకులుండేవారు. ఎవరి పద్ధతిలో వారు వృత్తి ధర్మాన్ని విలక్షణంగా పాటించారు. ప్రాతఃస్మరణీయులైన అటువంటి సంపాదకుల్లో నార్ల వెంకటేశ్వరరావు ఒకరు.

నార్ల సంపాదకత్వంలో *ఆంధ్రజ్యోతి* ఆవిర్భావానికి పూర్వం తెలుగు పత్రికలు స్థానిక వార్తలను బొత్తిగా

పట్టించుకునేవి కావు. జిల్లా కేంద్రాల్లో, చాలా పెద్ద పట్టణాల్లోనే ఏ తప్ప దినపత్రికలకు "స్వకీయ విలేఖరులు" ఉండేవారు కారు. ఆఖరికి జాల్లా కేంద్రాల్లో కూడా విలేఖరి లేని చోట్లూ ఉండేవి. జనరల్ వార్తలు పోగా స్థలం మిగిలిన పేజీల్లో ఒకటీ అరా స్థానిక వార్తలు వేయడమే గానీ ప్రాంతీయవార్తలకంటూ ప్రత్యేకంగా ఒక పేజీ అరుదు. ఉన్నా ఎక్కువ భాగం రంగు రుచీ లేని చద్ది వార్తలు. ఈ పరిస్థితుల్లో గ్రామీణ వార్తలకు ప్రత్యేక పేజీ కేటాయించి, మొఫసిల్ సెంటర్లలో విలేఖరుల సంఖ్యను బాగా పెంచి, భాషలో, రచనా శైలిలో, శీర్షికల్లో సామాన్య పాఠకులను ఆకట్టుకునే వినూత్న ఒరవడి పెట్టి తెలుగు పత్రికా రంగాన్ని కొత్త పుంత పట్టించి ప్రజలకు మరింత సన్నిహితం చేసినవాడు నార్ల. తరవాత కాలంలో వచ్చిన జిల్లా ఎడిషన్లు, టాబ్లాయిడ్ పిల్ల పత్రికలు నార్ల బాటకు కొనసాగింపే.

పూర్వ సంపాదకుల్లో గొప్ప సంపాదకీయాలకు పేరుపొందిన వారున్నారు. మొదటి పేజీని ముఖ్యమైన పేజీలను చక్కగా ముస్తాబు చేసి , చక్కని హెడ్డింగులతో, ఆకర్షణీయమైన వార్తాకథనాలతో అందంగా మలచినందుకు పేరు తెచ్చుకున్నవారున్నారు. రాజకీయాలను, రాజకీయ నేతలను సన్నిహితంగా గమనించి,లోతైన విశ్లేషణలతో సమకాలిక ధోరణులను వ్యాఖ్యానించి, అందరి మన్నన పొందిన వారున్నారు.ప్రజాహితానికి మంచిదని తాము విశ్వసించిన ఆశయం కోసం ఏకదీక్షగా ఉద్యమించిన వారున్నారు. వివిధానేక విషయాలపై విరివిగా గ్రంథ రచన సాగించి, కొత్త ఆలోచనలు రేకెత్తించి, వివిధ వర్గాల మేధావులపై చెరగని ముద్రవేసిన వారున్నారు. ఈ అన్ని లక్షణాలూ కలిగిన ఆల్‌రౌండర్లు మాత్రం చాలా చాలా తక్కువ అలాంటి వారిలో నార్ల ప్రథమగణ్యుడు.

ప్రతిభ వుండగానే సరిపోదు. అది రాణించటానికి అదృష్టం కూడా కావాలి. అనేక విషయాల్లో నార్లకు సరితూగేవారు, కొన్ని విషయాల్లో ఆయనకంటే ఒక మెట్టు పైనే ఉండేవారు తెలుగు పత్రికా సంపాదకుల్లో కొందరైనా ఉన్నారు. ఉదాహరణకు గోరాశాస్త్రి. అయినా నార్ల వలె వారికి రావలసినంత ఖ్యాతి రాలేదు. సంపాదకులుగా ఉన్నతకాలమూ వారు రాసింది చదివి అందరూ ఆహా, ఓహో అన్నవారే. వారి వీరాభి మానులమని చెప్పకుంటూ వెంటతిరిగి ఇచ్చకాలాడిన వారే, గతించాక వారిని తలిచినవారు, వారి కృషిని గుర్తుపెట్టుకుని, దానిని చిరస్థాయిగా నిలిపేందుకు నడుం బిగించినవారు చాలా తక్కువ. అప్పట్లో *ఆంధ్రభూమి* పత్రికను గోరాశాస్త్రి సంపాదకీయం కోసమే చదివేవారని చెప్పకుంటారు. ఇది విని ఆ సంపాదకీయాల గొప్పతనమేమిటో తెలుసుకోవాలని ఎవరైనా కోరుకున్నా ఇవాళ అవి దొరకవు. గొప్ప సంపాదకీయాలు కొన్నిటినైనా ఎంపిక చేసి పుస్తక రూపంలో ప్రచురించాలన్న సంకల్పం గోరాశాస్త్రి కి గల వేలాది అభిమానుల్లో ఒక్కరికీ కలిగినట్టు లేదు. కలిగినా కార్యరూపం దాల్చినట్టు నాకు తెలియదు.

ఈ విషయంలో నార్ల ఎంతో అదృష్టవంతుడు. ఆయన శిష్యవర్గం పెద్దది. దానికున్న అంగబలం, అర్థబలం పెద్దవి. జీవించి ఉండగా భుజానెత్తుకుని, ఆయనను నవయుగ వైతాళికుడని కీర్తించడమే గాక, ఆ యశస్సు భావితరాలకు తెలిసి, నిరంతర స్ఫూర్తినివ్వాలన్న ఆశయంతో బృహత్ ప్రయత్నాలు కొనసాగించే అభిమాన గణాన్ని సంపాదించుకోగలగటం నార్లవారి అసలు భాగ్యం. సంపాదకీయాలు సహా నార్లవారి రచనలు దాదాపు అన్నీ ఆయన జీవిత కాలంలోనే గ్రంథస్థం అయ్యాయి. కాగా సుదీర్ఘ పత్రికా వ్యాసంగంలో నార్ల చేసిన వందలాది పత్రికా రచనలు, నాటికలు, కవితలు, కథలు వగైరా అన్నిటినీ పన్నెండు సంపుటాలుగా నార్ల

కుటుంబం కొత్తగా ఇప్పుడు వెలువరించటం మంచి పని. సురవరం ప్రతాపరెడ్డి వంటి ఒకరిద్దరిని మినహాయిస్తే తెలుగు పత్రికా సంపాదకుల్లో ఇలా 'సంపూర్ణ గ్రంథావళి' ప్రచురణకు నోచుకున్నవారు ఎవరూ లేరనే చెప్పాలి.

'నార్ల రచనలు' పేర డాక్టర్ వెలగా వెంకటప్పయ్య సంపాదకత్వంలో వెలువడ్డ గ్రంథపరంపరలో ఆరవది 'వర్తమాన సంఘటనలు' (సంపాదకీయాలు). 1942-50 మధ్య *ఆంధ్రప్రభ*కూ, 1960-75 మధ్యకాలంలో *ఆంధ్రజ్యోతి*కీ సంపాదకుడిగా ఉన్న కాలంలో నార్ల రాసిన సంపాదకీయాల్లో ఆయనే ఎంపిక చేసినవి ఇందులో ఉన్నాయి. 'మూడు దశాబ్దాలు' పేర నార్ల పీఠికతో ఇంతకు పూర్వమే ఇవి అచ్చయ్యాయి. యథాతథ పునర్ముద్రణగా కాక ఉచితమనుకున్న మార్పుచేర్పులు చేసి, విషయానుక్రమంలో విభజించి, *ఆంధ్రప్రభ* వారపత్రిక, *ఆంధ్రజ్యోతి* మాసపత్రికలలో సమకాలిక ఘటనలను విశ్లేషిస్తూ రాసిన వ్యాసాలను కూడా జోడించటం వల్ల ఈ సంపుటానికి నిండుతనం వచ్చింది.

పత్రికావార్తల లాగే పత్రికా సంపాదకీయాలూ నిలవ ఉండే సరుకు కాదు. వండి వడ్డించినప్పుడు నవనవలాడుతుంటాయి. మరుసటి సంచికకల్లా పాతబడి చద్ది వాసన వేస్తాయి. తాను రాసిన వేలాది సంపాదకీయాల్లో నూటికి 90 వంతులు పునర్ముద్రణకు నిశ్చయంగా తగవని స్వయంగా నార్లవారే చెప్పారు.మిగిలిన పనికొచ్చే 10 వంతుల నుంచే సార్వకాలికం. చిరస్మరణీయం అనదగిన వాటిని ఎంపిక చేసి ప్రత్యేక సంపుటిగా ప్రచురించటం వల్ల సంపాదకుడిగా నార్ల విశిష్ట వ్యక్తిత్వాన్ని ఈ కాలపు జర్నలిస్టులు, నార్ల అభిమానులు అర్థం చేసుకుని, స్ఫూర్తి పొందటానికి వీలవుతుంది.

వివిధ సందర్భాల్లో, ఎన్నో కీలక ఘట్టాల్లో వాడిగా, వే డిగా, కుండబద్దలు కొట్టినట్లు నిర్మొహమాటంగా రాసిన మంచి సంపాదకీయాలు ఈ సంపుటిలో ఎన్నో ఉన్నాయి. అన్నిటిలోకీ ఉత్తమంగా నాకు తోచంది "మేము, మా పరాజయం". 1971 లోకసభ ఎన్నికల్లో దేశంలో ప్రముఖ పత్రికలు, తన వంటి సంపాదకులు ఎంత గట్టిగా వ్యతిరేకించినా ఇందిరాగాంధీ ఘనవిజయం సాధించిన సందర్భంలో రాసిన సంపాదకీయంలో నార్ల ఇలా అంటారు.

"తన అభిప్రాయాలను ప్రజలు త్రోసిపుచ్చవచ్చునని తెలిసినా, కేవలం త్రోసిపుచ్చటమే గాక, కంటగించుకొనగలరని తెలిసినా, తాను ఏది సముచితమని, ఏది న్యాయమని, ఏది ప్రజాక్షేమానికి తోడ్పడగలదని, ఏది దేశ హితానికి ప్రోది చేయగలదని, ఏది దూరదృష్టితో కూడినదని చిత్తశుద్ధితో హృదయ పూర్వకంగా తాను విశ్వసిస్తాడో, దానినే పత్రికా సంపాదకుడైనవాడు సమర్థించాలి. ఇందుకు సంకోచించేవాడు, ఇందుకు భయపడేవాడు పత్రికా సంపాదకుడనే పేరుకైనా తగడు. ఇంతే కాదు. తన ఉద్యోగాన్ని అతడు మలినం చేస్తాడు. దానికి మచ్చ తెస్తాడు...." *(పేజీ.129-31)*

ఫ్రేము కట్టించి దాచుకోదగ్గ స్వర్ణాక్షరాలివి. 'తక్కిన పత్రికలతో బాటు మేమూ ఘోరాతి ఘోర పరాజయం చెందినా, అందుకు అణుమాత్రం చింతించడం లేదనీ, ఇవే పరిస్థితులు ఎదురైతే మళ్ళీ ఇదే విధంగా బహుళ ప్రజాభిప్రాయానికి భిన్నంగా వెళ్ళడానికి సంకోచించబోమనీ' చెప్పడానికి పత్రికా సంపాదకుడికి చాలా గుండెధైర్యం కావాలి. అది పుష్కలంగా ఉన్నది కాబట్టే సుదీర్ఘ పాత్రికేయ వృత్తిలో అనేక సందర్భాల్లో ఏటికి ఎదరీది, దూషణ తిరస్కారాలను, పర్యవసానాలను లెక్కచేయక నిశ్చలంగా నిలిచి, తాను నమ్మినదానికి కట్టుబడి కొండలను సైతం ఢీకొనగలిగిన ధీరుడు నార్ల.

ఆ కాలంలో సంపాదకుడు పత్రికకు ఆరో ప్రాణం. ఈ కాలంలో ఆరో వేలు. యజమాని ఎవరిని కరవమంటే వారిని కరిచి, ఎవరిని కొలవమంటే వారిని కొలిచి తరించటమే సంపాదకుడి (లేక సంపాదకీయ రచయిత)పని అనుకోవలసిన ఈ రోజుల్లో 'మొత్తం ప్రపంచమే ఒక విధంగా ఆలోచిస్తున్నా ఆ ఆలోచనతో తాను ఏకీభవించలేకపోతే, ఆ మార్గాన్ని తాను హర్షించలేకపోతే, పత్రికా సంపాదకుడు ఏకాకిగా నిలవడానికి సన్నద్ధపడాలి. లేని పక్షంలో అతడు పత్రికాసంపాదకుడన్న పేరుకైనా తగడు' అన్న నార్ల మాటలు మనకు చిత్రంగా తోచవచ్చు. మన కాలంలో పత్రికా వృత్తికి, వృత్తి ప్రమాణాలకు పట్టిన దుర్గతికి సిగ్గుపడటమే మనం చేయగలిగింది!

నార్ల నిస్సందేహంగా గొప్ప సంపాదకుడే. గొప్ప మేధావే. గొప్ప రచయితే. అలాగని నార్ల రాసిందల్లా గొప్పదని చెప్పలేము. ఇప్పుడు సమీక్షిస్తున్న సంపుటిలో చాలా నాణ్యమైనవని ఎంపిక చేసివాటిలోనే బహు చక్కని సంపాదకీయాలతోబాటు భాషపరంగా, శైలీ పరంగా, విషయపరంగా పేలవమైనవీ ఉన్నాయి.

ఉదాహరణకు 1972 ఆగస్టులో రాసిన "కాంగ్రెస్ ప్రభుత్వం" సంపాదకీయం ఇలా సాగుతుంది.

"స్వాతంత్ర్యంతో తమ కష్టాలు గట్టెక్కునని ఆశపెట్టుకున్న ప్రజల ఆశలు నిరాశలగుచున్నవి. వారే కాంగ్రెసు చోదకులు, కాంగ్రెసు పాలకులు అగుట వల్ల మరింత విమర్శకు గురి అయ్యారు. వారి ద్వంద్వ నాయకత్వంవల్ల కాంగ్రెసుకు అపఖ్యాతి ఆపాదింపబడుతున్నది...అదేమి చిత్రమో అస్వతంత్రులై యున్ననాడు దేశభక్తి, ప్రజాసేవ ఆదిగా గల సద్గుణాలు స్వతంత్రులైన మరుక్షణాన అదృశ్యం కావడం అంటె. మేము ఆలోచించగలిగినంతవరకు ఈ ప్రశ్నకు మాకు తోస్తున్న సమాధానమిది. ఈ నాడు దేశంలో ఏ వర్గంలోను తన భవిష్యత్తును గురించి ఆశాభావం తగినంత గట్టిగా లేదు" (పేజి 70)

విషయానికి సందర్భానికి తగ్గట్టు భాష ఉండడం మంచి లక్షణమే. సంపాదకీయం అంటే బిగుసుకుపోయి గంభీర ముద్రతో ఒకే మూసలో చేయవలసిన ధర్మబోధ అనుకోకుండా సందర్భోచితంగా శైలిని మార్చటం సబబే. ఈ రకమైన వైవిధ్యం నార్లవారిలో బాగానే కనిపిస్తుంది. ఉదాహరణకు 'తెలుగువాడా' అన్న 1952 అక్టోబరు సంపాదకీయం ఇలా మొదలవుతుంది.

'ఎన్నాళ్ళనించి కలలు కంటున్నావు 'రాష్ట్రం' అంటూ! ఎన్నాళ్ళనుంచి ఎదురుతెన్నులు కాస్తున్నావు నీ ప్రత్యేక రాష్ట్రం కోసం!'

ఇలా ముగుస్తుంది.

"నీ రాష్ట్రాన్ని పుచ్చుకొనడానికి ముందుకురా ! నీకు అడ్డుగా నిలుస్తున్న వారిని నెట్టివేస్తూ ముందుకు రా! రావయ్యా రా ! ముందుకు రా !!" *(పేజి 77)*

కాని ఇదే కలం నుంచి వెలువడిన *"ఆంధ్రజ్యోతిపై దాడి"* సంపాదకీయాన్ని గమనించండి. తాను సంపాదకుడుగా ఉన్న దినపత్రిక కులతత్వ ధోరణి కలది అని ముద్ర వేసి రాష్ట్ర ప్రభుత్వం బ్లాక్ లిస్టులో పెట్టినప్పుడు బాధను, ఆగ్రహాన్ని వ్యక్తీకరిస్తూ, ప్రభుత్వాన్ని సవాలుచేస్తూ నార్ల రాసిన సంపాదకీయం ఇలా మొదలవుతుంది.

"మతవిద్వేషాలను ప్రోత్సాహించేవాడిని నిరసించవలసిందే. ఖండించవలసిందే. అణచి వేయవలసిందే - ఈ విషయమై లవలేశంగానైనా సందేహానికి ఆస్కారం లేదు.

మనది వివిధ మతాలున్న దేశం. హిందూ మహమ్మదీయ, క్రైస్తవ మతాలే కాదు; ఇక్కడ శిక్కుమతం ఉన్నది, బౌద్ధ జైనాలున్నాయి. చార్వాక మతమైనా లేకపోలేదు. ఇన్ని మతాలున్న దేశంలో మత సామరస్యం లేకపోతే.

జాతికి శాంతి లేదు. భద్రత లేదు. పురోగతి లేదు. భవిష్యత్తు లేదు.

ఈనాడే కాదు, చిరకాలంగా విజ్ఞులైన వారందరు, దూరదృష్టి గల వారందరు... ఈ సత్యాన్ని గుర్తిస్తున్నారు. అన్ని మతాల మధ్య సామరస్య సౌహార్ద్రాలను నెలకొల్పగల మత సిద్ధాంతాలను రూపొందించడానికి అక్బర్ పాదుషా ప్రయత్నించాడు."అల్లా, రాముడు ఒక్కడే" అని కబీర్ ఉద్ఘాటించాడు... ..." *(పేజి 381)*

వ్యర్థ పదాడంబరానికి, అప్రస్తుత ప్రసంగానికి, ఒక సంపాదకీయాన్ని ఎలా రాయకూడదనడానికి ఇది మచ్చుతునక!

నిజాం సంస్థానంపై పోలీసు చర్యకు నెహ్రూ ప్రభుత్వం నిశ్చయించిన చరిత్రాత్మక ఘట్టాన్ని వ్యాఖ్యానించే సంపాదకీయాన్ని- "ఫ్లాష్ ఫ్లాష్ ఫ్లాష్" అంటూ నేటి మధ్యాహ్నం సరిగ్గా రెండు 12 గంటల 35 నిమిషాలకు "టెలిప్రింటర్ పై" ఒక న్యూఢిల్లీ వార్త వచ్చింది. మరి మూడు నిమిషాలకు "ఫ్లాష్ ఫ్లాష్ ఫ్లాష్" అంటూ ఇదే వార్త పునశ్చరణ చేయబడింది"- అని ప్రారంభించటమూ ఈ కోవలోకే వస్తుంది, (పేజి67)

నమ్మిన విశ్వాసానికి నిశ్చలంగా కట్టుబడటం మంచిదే అయినా తాను నమ్మనివన్నీ అంధవిశ్వాసాలని, గడ్డిపోచ పాటి విలువ చెయ్యవని తీసిపారేయటం తప్పు. "ఒక జనక మహారాజును, ఒక యాజ్ఞవల్క్యుని, ఒక పెరిక్లెజ్‌ను, ఒక ప్లేటోను ప్రాచీనులకు ప్రతినిధులుగా తీసుకుంటే, వారి విజ్ఞానంకంటే ఈ నాడు ఒక బి.ఎస్.సి. విజ్ఞానం నూరు రెట్లు హెచ్చు, వెయ్యి రెట్లు హెచ్చు" *(పేజి 151)* అన్నది హేతువాదినని అనుకునేవాడు అనకూడని మాట. తెలియని తనానికి, మూర్ఖత్వానికి ఇది సూచిక .

ఇష్టాలు, అనిష్టాలు చాలా గట్టిగ, అవసరమైన మోతాదుకు మించి ఉన్నవాడు నార్ల. సంజీవరెడ్డిని ఎంత అభిమానించాడో, బ్రహ్మానందరెడ్డిని అంత అసహ్యించుకున్నాడు. నెహ్రూను ఎంత ప్రేమించాడో, ఆయన కుమార్తెను అంత ద్వేషించాడు. తనకు నచ్చిన వాదాలను, వ్యక్తులను, వ్యవస్థలను ఎంతగా నెత్తిన పెట్టుకున్నాడో తనకు గిట్టని కమ్యూనిజాన్ని, బ్రాహ్మణీకాన్ని, విశ్వనాథాదులను అంతగా ఈసడించాడు. తనకు సరిపడని మహా రచయితలు కొందరి పేరునైనా తన పత్రికలో ప్రస్తావించటానికి ఇష్టపడని ప్రజాస్వామ్యవాది, నిష్పక్షపాతి నార్ల. తాను ఏవగించుకునేవారి ప్రస్తావన వచ్చినప్పుడు ఔచిత్యాన్ని పట్టించుకోక నేలబారు వ్యాఖ్యలు చేయటానికి ఆయన వెనకాడడు. ముఖ్యంగా ఇందిర, సంజయ్‌గాంధిల గురించి ఆయన చరమ దశలో రాసిన రాతలు అలాంటివే. ఏదో విందులో సంజయ్ తనని ఆరుసార్లు చెంపపెట్లు పెడితే ఇందిర గుడ్లనీళ్ళు కక్కుకుని మిన్నకున్నదని ఎవరో రాసిన దాన్ని, ఆకాలంలో అందరూ చెప్పకున్న బజారు కబురును సీరియస్ వ్యాసంలో *(పేజి 189)* ప్రస్తావించటమూ ఈ బాపతుదే.

తనను నమ్మి,తన కోసం పత్రిక పెట్టి, సంపాదకుడిగా సర్వాధికారాలు అప్పగించిన కె.ఎల్.ఎన్.ప్రసాద్‌తో తగువు పడి, బయటికి వచ్చి, కొన్నేళ్ళు పేరుకు మాత్రం సంపాదకుడిగా ఉండి, ఆనక ఆ ఏర్పాటునూ తెగతెంపులు చేసుకున్నాక ఆయన పట్ల వ్యవహరించిన తీరూ నార్ల వ్యక్తిత్వానికి వన్నె తెచ్చేది కాదు. *ఆంధ్రప్రభ* వారపత్రికలో 1977 చివర్లో తాను నడిపిన *లోకం పోకడ* కాలమ్‌ను ఆ "దిక్కుమాలిన కుర్రకుంకే" ఒత్తిడి తెచ్చి ఆపించాడని ఆరోపిస్తూ నార్ల చేసిన వ్యాఖ్య (**"My feature in Andhra Prabha weekly was stopped as a result of the pressure brought on its proprietors by the same guttersnipe who converted into his personal estaste the institution of Andhra Jyothi which I founded"**) ఆయన స్థాయికి తగ్గది కాదు.

వృద్ధాప్యపు నిస్సహాయతలో, పట్టరాని కోపంలో ఆయన ఎవరికో ప్రైవేటు ఉత్తరంలో బ్యాలెన్స్ తప్పి రాసిన దానిని ఈ సంపుటిలో బాక్స్ కట్టి *(198 పేజి)* అచ్చువేయటమూ బాగా లేదు.

ఏమైనా తెలుగునాట కొన్ని తరాల మేధావులను ప్రభావితం చేసిన నార్ల బహుముఖ ప్రజ్ఞకు, ఆయన విలక్షణ వ్యక్తిత్వంలోని వెలుగు నీడలకు ఈ 12 సంపుటాల *'నార్ల రచనలు'* అద్దం పడతాయి. విశేష వ్యయ ప్రయాసలకోర్చి ఈ బృహత్కార్యాన్ని చక్కగా నిర్వర్తించిన నార్ల కుటుంబ సభ్యులు, సంపాదక బాధ్యత వహించిన వెంకటప్పయ్యగారు అభినందనీయులు.

- (ఆంధ్రభూమి సౌజన్యంతో)

back to book of the week home page

---

*ఈ విశేష సమీక్షా వ్యాసం శ్రీ కొడాలి సత్యనారాయణ (ట్రాయ్-మిచిగన్-యు.ఎస్.ఎ) గారి వదాన్య సౌజన్యంతో అందించబడింది.*

---